సాక్షి
రంగారెడ్డి

సోమవారం ı 8 ı సెప్టెంబర్ ı 2025



లాభాల 'బంతి'

తక్కువ నీటి వనరులతో బంతి సాగు చేస్తూ, సస్యరక్షణ చేపడితే మంచి ఆదాయం పొందొచ్చని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



పోటీపడి.. వేలంవేసి

వినాయకుడి లడ్డూలు రూ.లక్షల్లో ధర పలికాయి. వేలంలో దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. 8లో▸



యూరియా వచ్చింది..

యాచారం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం వద్ద ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ ఆదివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఈనెల 9న (మంగళవారం) ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు హైదరాబాద్‌లోని మల్లేపల్లిలోని ఉపాధి కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని రిటైల్, ఈ–కామర్స్, బ్యాంకింగ్, వాయిస్ నాన్ వాయిస్ ప్రాసెస్, నాన్ ఐటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో పోస్టులు ఉన్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ డిప్లమా పూర్తి చేసి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వివరాలకు 90630 99306, 89771 75394 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ట్రాఫిక్ కేసులపై లోక్‌అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీసు కేసుల పరిష్కారానికి సోమవారం నుంచి ఈనెల 13వ తేదీవరకు చేవెళ్ల కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వారు, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి పెండింగ్ కేసులు తక్కువ జరిమానాతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆధార్‌కార్డు, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లతో రావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 99632 95757, 94906 17461 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈనెల 12 నుంచి ఏఐపై జాతీయ సదస్సు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజులపాటు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె తెలిపారు. గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యక్ష పద్ధతి (ఆఫ్‌లైన్), పరోక్ష పద్ధతి (ఆన్‌లైన్)లో సెమినార్ ఉంటుందన్నారు. ప్రజెంటేషన్ ఇచ్చేవారు తగిన రుసుము చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రజెంటేషన్ ఇచ్చేందుకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తున్నారని, ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన వారికి బహుమతులు, ప్రజెంటేషన్‌లో పాల్గొన్న వారిందరికీ కిట్స్, సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 97034 41345, 97059 67553, 79010 97702 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ(డిగ్రీ) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్సీలో అడ్మిషన్ పొందాలనేకునే విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీలో కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఎస్టీలకు 30, బీసీలకు 2, ఎస్సీలకు 2, ఓసీలకు 2, అనాథ (ఆర్ఫాన్)లకు 2, స్పోర్ట్స్ కోటా కింద 2 సీట్లు ఉన్నట్టు తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా కళాశాలలో సంప్రదించాలని చెప్పారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులు డిగ్రీ, పీజీని పూర్తి చేసుకుంటారన్నారు. వివరాలకు 89789 42246, 97059 67553, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లేమూరు ఆలయంలో మాజీ మంత్రుల పూజలు



కందుకూరు: మండలంలోని లేమూరు పరిధిలోని శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆదివారం మాజీ మంత్రులు కె.జానారెడ్డి, జి.చిన్నారెడ్డి, డీకే సమరసింహారెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం గురించి ట్రస్ట్ చైర్మన్ గూడూరు కొండారెడ్డి, దేవాలయ విశిష్టత గురించి స్థపతి శివనాగిరెడ్డి వారికి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్, నాయకులు మూల భాస్కర్‌రెడ్డి, పాండు, కె.జైపాల్‌రెడ్డి, బాలకృష్ణ, ఐలయ్య, బీరప్ప, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లోటులోనే లోతులోనే నీళ్లు!

కనిపించని ఆనవాళ్లు

- జిల్లాలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదు
- ఇంకా 12.09 సెంటీమీటర్ల లోటు
- పాతాళంలోనే గంగమ్మ
- అడుగునే భూగర్భ జలాలు
- బోసిపోయిన పలు చెరువులు, కుంటలు



మంచాల మండలం జాపాల పరిధిలో నీళ్లు లేక వెలవెలబోతున్న మధ్యగుంట చెరువు

ఆరేళ్లలో నమోదైన వర్షపాతం (సెంటీ మీటర్లలో..)

సంవత్సరం	సాధారణం	నమోదైంది
2022–21	69.46	122.52
2021–22	69.46	95.35
2022–23	69.46	112.20
2023–24	72.58	72.19
2024–25	72.58	93.74
2025–26	75.05	62.15

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతంనమోదైంది. వికారాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఈసీ, మూసీ వాగులు పొంగిపొర్లాయి. జంటజలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు వరద పోటెత్తింది. కడ్తాల్, మాడ్గుల, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, జిల్లెడు చౌదరిగూడ, హయత్‌నగర్, గండిపేట మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఆయా మండలాల్లో ఇప్పటికీ పలు చెరువులు, కుంటలు నీళ్లు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు ఆశించిన స్థాయిలో నీరు చేరక వెలవెలబోతోంది. ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడానికి తోడు వరద నీటిని మోసుకొచ్చే కాల్వలు, గొలుసు కట్టు చెరువులు, కుంటలు ధ్వంసం కావడమే ఇందుకు కారణం. జిల్లాలో 2,100పైగా చెరువులు, కుంటలు ఉండగా, వీటిలో సగానికి పైగా నీళ్లు లేక వెలవెలబోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఆశించిన స్థాయిలో వర్షాలు లేక..

కడ్తాల్ మండలంలో సాధారణం కంటే అతి తక్కువగా 47.18 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, మాడ్గులలో 48.60, యాచారంలో 49.95, మంచాలలో 50.93 సెం.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. గత ఏడాది జిల్లాలో నమోదైన వర్షపాతంతో పోలిస్తే ఈ ఏడాది చాలా తక్కువ నమోదైంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు ఇప్పటికీ పాతాళానికే పరిమితమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం ఫీజో మీటర్‌లో 18 మీటర్ల లోతులో నీటి ఆనవాళ్లు కన్పించగా, మంచాల మండలంలో 12.14 మీటర్ల లోతుకే పరిమితమయ్యాయి. ఇక శంకర్‌పల్లి మండలంలో 10.99 మీటర్ల లోతులో నీటి ఆనవాళ్లు లభ్యం కాగా, తలకొండపల్లిలో 10.88 మీటర్ల లోతులో ఉన్నాయి. యాచారం మండలంలో 10.64 మీటర్ల లోతుకు పరిమితమయ్యాయి. ఏకధాటి వర్షాలు, భారీ వరదలు పోటెత్తినప్పటికీ జిల్లాలోని భూగర్భజల మట్టం ఆశించిన స్థాయిలో పైకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు నందిగామ, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, కేశంపేట, కందుకూరు, బాలాపూర్, చౌదరిగూడెం, చేవెళ్ల ఫీజో మీటర్లలో మాత్రం నాలుగు మీటర్ల లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తుండటం విశేషం.

ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతం (సెంటీ మీటర్లలో)

మాసం	సాధారణం	నమోదైంది
జూన్	9.72	7.38
జూలై	14.43	22.18
ఆగస్టు	15.33	31.64
సెప్టెంబర్	3.00	0.95

అప్పుడే కరువు ఛాయలు

మంచాల మండలంలో 23 గ్రామాలు ఉండగా, వీటిలో ఆరుట్ల, మంచాల మినహా ఇతర గ్రామాల్లోని చెరువులు, కుంటలకు చుక్క నీరు చేరలేదు. ఇక్కడి రైతులు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడుతుంటారు. బోరుబావులు కూడా సరిపడా నీరు పోయక పోవడంతో వరినాట్లకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. గతంలో రెండు మూడు ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు ప్రస్తుతం అర ఎకరం, ఎకరానికే పరిమితమయ్యారు. వినాయక చవితి వేడుకల్లో ఘనంగా పూజలు అందుకున్న గణనాథుల నిమజ్జనం కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో నాగార్జున సాగర్ ఇతర ప్రాజెక్టుల వద్దకు తీసుకెళ్లాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోచ్చు. తాళ్లపల్లిగూడలో చెరువులో నీళ్లు లేక చెరువు మధ్యలో భారీ గుంత తవ్వి అందులో వినాయక విగ్రహాన్ని ఉంచి, బోరు నీటితో నింపి నిమజ్జనం చేయాల్సి వచ్చింది. అదేవిధంగా జాపాలలోని మధ్యకుంటలోకి ఇప్పటి వరకు చుక్కనీరు చేరలేదు.

చిలుకూరు ఆలయం మూసివేత



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసిన అర్చకులు

మొయినాబాద్: చంద్ర గ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని ఆదివారం సాయంత్రం మూసివేశారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. రాత్రి చంద్రగ్రహణం ఉండటంతో సాయంత్రం 4 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. గర్భగుడి తలుపులు మూసి తాళాలు వేశారు. ఆలయ గోపురం ప్రధాన ద్వారాన్ని సైతం మూసివేశారు. గ్రహణం తరువాత సోమవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ చేసి ఆలయాన్ని తెరువనున్నారు. స్వామివారికి అభిషేకం చేసిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్టు అర్చకుడు రంగరాజన్ తెలిపారు.

మైసిగండి మైసమ్మ ఆలయం ..

కడ్తాల్: చంద్రగ్రహణం సందర్భంగా మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వాహకులు మూసివేశారు. గ్రహణం ముగిసిన అనంతరం సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం తిరిగి భక్తుల దర్శనానికి అనుమతి కల్పించనున్నట్లు తెలిపారు.



కడ్తాల్: మైసమ్మ ఆలయాన్ని మూసివేసిన నిర్వాహకులు, సిబ్బంది

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు



విజేతలకు మెడల్స్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: కరాటే నేర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని మోకిలలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి సక్సెస్ షోటోకాన్–2025 చాంపియన్ పోటీలను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు ప్రారంభించగా.. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పోటీలను టి.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా మోకిలకి చెందిన మన్నె వెంకటేశ్ స్పాన్సర్ చేశారు. పలు జిల్లాలకు చెందిన సుమారు 500 మంది 5 నుంచి 16 ఏళ్లలోపు చిన్నారులు తమ ప్రతిభ చాటారు. కార్యక్రమంలో సక్సెస్ షోటోకాన్ టెక్నికల్ అడ్వైజర్ రవీందర్, ఫౌండర్ అనిల్ కుమార్, కోచ్‌లు శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చి ఆగం చేస్తారా



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

ఆమనగల్లులో భూ నిర్వాసితుల ఆందోళన

ఆమనగల్లు: పెద్దోళ్ల కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి పేదల బతుకులను ఆగం చేస్తారా అంటూ భూ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం నిరసన చేపట్టారు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట, గౌరిపల్లి, జంగారెడ్డిపల్లి, చంద్రధన, ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం ర్యాలీగా వచ్చి హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు ధర్నాలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. బడాబాబులు, భూస్వాముల భూములను రక్షించేందుకు కొత్తగా అలైన్‌మెంట్‌ను తీసుకువచ్చి సన్న, చిన్నకారు రైతుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

భూములు ఇచ్చేది లేదు

షాద్‌నగర్: ప్రాణాలైనా ఇస్తాం కానీ రీజినల్ రింగ్ రోడ్డుకు తమ భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. ట్రిపుల్‌ఆర్ భూసేకరణకు వ్యతిరేకంగా ఆదివారం కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో ట్రిపుల్‌ఆర్ భూసేకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మిస్తున్న రీజనల్ రింగురోడ్డు తమ వ్యవసాయ భూముల నుంచి వెళ్తోందని, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణంలో భూములు పోతే జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంగయ్య, మాజీ సర్పంచ్‌లు భీమయ్య, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌కు ఆహ్వానం




స్పీకర్‌తో బండారు దత్తాత్రేయ

అనంతగిరి: హైదరాబాద్‌లో ఏటా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్పీకర్ నివాసానికి వెళ్లి అక్టోబర్ 3న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కార్యక్రమ ఆహ్వాన పత్రిక అందజేశారు.

గణేశ్ నిమజ్జనోత్సవం విజయవంతం

- 2 లక్షల 70 వేల విగ్రహాల నిమజ్జనం
- 11 వేల టన్నుల వ్యర్థాల సేకరణ



లక్డీకాపూల్ : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు గ్రేటర్ వ్యాప్తంగా 2 లక్షల 70 వేల గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారన్నారు. పకడ్బందీ ప్రణాళిక, పటిష్టమైన ఏర్పాట్లతో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీస్, విద్యుత్, హెచ్ఎండీఏ, హైడ్రా, రెవెన్యూ, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ అభినందనలు తెలిపారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యంతోపాటు టాయిలెట్లు, సరిపడా క్రేన్ల ఏర్పాటు తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. నిమజ్జనం మార్గం పొడవునా ఏర్పాటు చేసిన గణేశ్ యాక్షన్ టీమ్స్ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో ఫలితం కనిపించింది. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో నగరంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, ప్రధానంగా నగరంలో ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణేశ్‌లతో సహా నిమజ్జన శోభాయాత్ర జరిగే 303 కిలోమీటర్ల మేర మార్గం మరమ్మతులు చేపట్టడంతో ఊరేగింపు సాఫీగా, సురక్షితంగా, వేగంగా జరిగిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత నిస్తూ 15 వేల మంది సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించడంతో పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు కనిపించలేదన్నారు. 72 కృత్రిమ కొలనులతో ప్రధాన చెరువులపై ఒత్తిడి లేకుండా, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, భక్తులు స్థానికంగానే నిమజ్జనం అయ్యేలా చూడగలిగామన్నారు. జీహెచ్ఎంసీ కల్పించిన ఉచిత భోజన సౌకర్యం భక్తులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. వేడుకల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలను మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారి నిరంతర సేవలతోనే ఇప్పటి వరకూ 11 వేల అధిక టన్నుల వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ సెంటర్‌కు పంపామన్నారు. కార్మికుల సేవలు భేష్ అంటూ ప్రశంసించారు.

ఎత్తే సవాలైంది!

ఈసారి గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఆలస్యం

- విగ్రహాల ఎత్తు పెరగడమే దీనికి కారణం
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉదంతాలు
- 40 గంటలు అవిశ్రాంతంగా విధులు : సీపీ ఆనంద్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన శోభాయాత్ర ఆదివారం తెల్లవారుజామున ముగిసినా హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనం మాత్రం అర్ధరాత్రి వరకు కొనసాగింది. సోమవారం ఉదయానికి ఇది పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈసారి మండపాల సంఖ్యతోపాటు విగ్రహాల ఎత్తూ గణనీయంగా పెరిగిపోవడంతోనే నిమజ్జన ప్రక్రియలో కొంత జాప్యం జరిగినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రకటించారు.

'ఆఫ్‌లైన్'లో రెట్టింపు వరకు..

నగర కమిషనరేట్ పరిధిలో గణేశ్ మండపాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది మొత్తం 12,030 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. అనుమతులు తీసుకోకుండా మరో 40 వేల మండపాలు ఏర్పాటయ్యాయి. క్షేత్రస్థాయి అధికారులు ఆఫ్‌లైన్ విధానంలో వాటి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా గణపతి విగ్రహాల ఎత్తు, నిమజ్జన ఊరేగింపు మార్గం తదితరాలను గుర్తిస్తూ అది నిమజ్జనం అయ్యే వరకు పర్యవేక్షించారు. దీనికోసం ప్రతి విగ్రహానికి ఓ క్యూఆర్ కోడ్ కేటాయించారు. ఈ మండపాల నుంచి నిమజ్జనం జరిగే ప్రాంతం వరకు ప్రతి మార్గాన్నీ పర్యవేక్షించిన అధికారులు అడ్డంకులు లేకుండా కృషి చేశారు.

'లెక్కల్లో'లేని ఆ విగ్రహాలు

నగరంలో ఏర్పాటైన కొన్ని విగ్రహాలతోపాటు పొరుగు కమిషనరేట్లు, జిల్లాల నుంచి వచ్చిన విగ్రహాల ఊరేగింపులతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. వీటిలో కొన్ని ఏకంగా 40 అడుగుల ఎత్తు ఉన్నాయి. ఫలితంగా ఆయా మార్గాల్లో ఉన్న కొన్ని కరెంట్ వైర్లు, చెట్లు, కేబుల్ తీగలు విగ్రహాలకు అడ్డంకులుగా మారాయి. మోనప్ప ఐలాండ్–రాజ్‌భవన్ మార్గంలో శనివారం రాత్రి ఓ విగ్రహం చెట్టు కొమ్మలకు తగిలి వాహనంపైనే వెనక్కు ఒరిగిపోయింది. దీంతో పంజగుట్ట ప్రాంతంలో రిజర్వ్‌లో ఉంచిన క్రేన్‌ను తీసుకువచ్చి విగ్రహానికి ఎలాంటి నష్టం లేకుండా వాహనంపై నిలబెట్టారు. ఇలా మరికొన్ని చోట్లా జరగడంతో ఆయా మార్గాల్లో వాహనాలు ఆగిపోయి శోభాయాత్రకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

నెక్లెస్‌రోడ్‌లోకి చేరిన 900 విగ్రహాలు

ఈ ఏడాది మూడోరోజు నుంచి పదకొండో రోజు వరకు దాదాపు 1.4 లక్షల విగ్రహాలు నిమజ్జనమైనట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో 1.2 లక్షల విగ్రహాలు బేబీ పాండ్స్, ఇతర చిన్న చెరువుల్లో నిమజ్జనం కాగా.. మిగిలినవి హుస్సేన్‌సాగర్‌సహా ఇతర చెరువుల్లో జరిగాయి. ఐదడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న 4,700 విగ్రహాలు శనివారం ఉదయం నుంచి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నానికి దాదాపు 900 విగ్రహాలతో ఉన్న లారీలు మిగిలిపోవడంతో వీటిని నెక్లెస్ రోడ్డులోకి మళ్లించారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్కు వద్ద ఉన్న కొన్ని క్రేన్ల ద్వారా నిమజ్జనం చేస్తున్నారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు పాక్షికంగా ఎత్తేశారు. సోమవారం తెల్లవారుజాముకు ఈ క్రతువును సంపూర్ణం చేసి, ఆంక్షల్ని ఎత్తేయనున్నారు.

> **మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు**
>
> ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో బడా గణేశుడి నిమజ్జనం గతేడాది కంటే ముందుగా పూర్తయింది. మాకు సహకరించిన ఉత్సవ సమితితోపాటు మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఊరేగింపుల్లో జరిగిన చిన్నచిన్న ఘర్షణలపై వివిధ ఠాణాల్లో ఐదు కేసులు నమోదయ్యాయి. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 170 మంది పోకిరీలతోపాటు జేబుదొంగల్ని పట్టుకున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇలాంటి నేరాల సంఖ్య తగ్గింది. సామూహిక నిమజ్జనం కోసం దాదాపు 40 గంటల నిర్విరామంగా పని చేసిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు.
>
> – సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

పోటీపడి.. వేలంవేసి

చవితి ఉత్సవాల్లో నేపథ్యంలో.. నవ రాత్రులు పూజలందుకున్న వినాయకుడి చేతిలోని లడ్డూలకు మహాక్రేజీ ఏర్పడింది. కలిసి వస్తుందన్న విశ్వాసంతో.. వేలంలో ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. రూ.లక్షలు వెచ్చించి కైవసం చేసుకున్నారు.



షాబాద్: స్వామివారి ప్రసాదంతో భక్తుడు చెన్నయ్య తదితరులు



శంకర్‌పల్లి: విఠలేశ్వర ఆలయం వద్ద భక్తులు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ రెడ్డి సోదరులు



శంకర్‌పల్లి: మాసానిగూడలో లడ్డూ సొంతం చేసుకున్న శ్రీశైలం



శంకర్‌పల్లి: లడ్డూతో శేరిగూడ మాజీ సర్పంచి సత్యనారాయణ తదితరులు



తుక్కుగూడ: లడ్డూతో భక్తుడు కేదార్నాథ్ తదితరులు

- గణపతి లడ్డూల కైవసం
- రూ.లక్షలు వెచ్చించిన భక్తులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలో గణనాథుల లడ్డూ ధరలు భారీగా పలికాయి. విఠలేశ్వర ఆలయంలో కొలువైన గణనాథుని లడ్డూని ఏనుగు పవన్ కుమార్‌రెడ్డి, అనిల్ రెడ్డి సోదరులు రూ.9,11,116 లక్షలకు, బుల్కాపూర్ హనుమాన్ మందిర్‌లో మణికొండ మల్లారెడ్డి రూ.8 లక్షలకు దక్కించుకున్నాడు. మండల పరిధి శేరిగూడలో మాజీ సర్పంచి సత్యనారాయణ రూ.9లక్షలు, మాసానిగూడ హనుమాన్ మందిరంలో కుర్మ సంఘం శంకర్‌పల్లి ఉపాధ్యక్షుడు శ్రీశైలం రూ.7.20 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మహా ప్రసాదాలను కైవసం చేసుకున్న భక్తులను.. ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

రూ.13.50 లక్షలకు..

తుక్కుగూడ: పురపాలిక కేంద్రంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూకు ఆదివారం వేలం పాట వేయగా.. భక్తుడు ముప్పిడి కేదార్నాథ్ సోదరులు రూ.13.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మాంచి, ప్రసాదం అందజేశారు. అనంతరం గణపతిని నిమజ్జనం చేశారు.

రూ.18 లక్షలకు..

షాబాద్: షాబాద్ గ్రామంలో 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణపతి లడ్డూకు శనివారం రాత్రి నిర్వహించిన వేలం నిర్వహించారు. ఈ పాటలో సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య రూ.18 లక్షల 11 వందల 11లకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో తమ్మలి రవీందర్, జడల రాజేందర్‌గౌడ్, వెంకట్ యాదవ్, కావలి మహేశ్ యాదవ్, దర్పల్లి రవీందర్‌గౌడ్, దండు రాహుల్‌గుప్తా, కమ్మరి శ్రీను, గడ్డం చంద్రయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా రామచంద్రానగర్‌కు చెందిన సయ్యద్ అనాస్ కుమారుడు సయ్యద్ జకీ(20) షాహిన్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఉదయం 6.50 గంటలకు విధులు ముగించుకొని తన బంధువు ఒబేదుల్లా ఖాన్(19)తో కలిసి పల్సర్ బైక్‌పై షాహిన్‌నగర్ నుంచి బార్కాస్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉస్మానియా హోటల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఒవైసీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే జకీ మృతి చెందాడు. మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుడు సయ్యద్ జుహేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిమజ్జనంలో ఘర్షణ

పలువురిపై కేసులు నమోదు

కొత్తూరు: గణపతి నిమజ్జనంలో ఘర్షణకు పాల్పడిన ఇరువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శనివారం.. నేతాజీ యువజన సంఘం ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొనగా.. అదే కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆదివారం ఇరు వర్గాల వారిపై కేసు నమెదు చేశామని పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని, మహిళకు గాయాలు



గాయాలతో పడున్న సరిత

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన సరిత, కుటుంబ సభ్యులు కలిసి మొయినాబాద్‌కు వలస వచ్చారు. సరిత సజ్జన్‌పల్లి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఆమె కూలి పనిచేస్తోంది. ఆదివారం రాత్రి పని ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో.. మండల పరిధి అప్పారెడ్డిగూడ గేటు దాటుతుండగా చేవెళ్ల నుంచి మెహదీపట్నం వెళ్తున్న ఆర్టీసీ మెట్రో(అద్దె) బస్సు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ బస్సును అక్కడే వదిలేసి పారిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా.. ఆమెను చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

లాభాల 'బంతి'

ఉద్యాన పంటలతో లాభాల పంట పడుతుంది. నీటి వసతి కలిగిన ప్రాంతం.. బంతి సాగుకు అనుకూలమైనది. తక్కువ పెట్టుబడితో, యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



సర్దార్‌నగర్‌లో బంతి తోట

సిరులు కురిపిస్తున్న సాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- యాజమాన్య పద్ధితిని అవలంబిస్తే మేలు
- చేవెళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కీర్తి



షాబాద్: ఉద్యానపంటల సాగులో డ్రిప్ పద్ధతిని అవలంబిస్తే నీటిని పొదుపు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. పండుగలు, ఇంటి గుమ్మాల అలంకరణకు, ఆలయాల్లో నిర్వహించే పూజలకు అవసరమయ్యే బంతి పూలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ నీటి వనరులతో బంతిని సాగు చేస్తూ, సస్యరక్షణ చేపడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చు అని చేవెళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కీర్తి తెలిపారు. అన్ని కాలాల్లో అనుకూలంగా సాగు చేసే బంతిపై సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే..

ఏపుగా పెరిగితే..

బంతిలో ఆఫ్రికన్, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ ఉన్నాయి. నీటి వసతి కలిగిన అన్ని కాలాలు, సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలలు బంతి సాగుకు అనుకూలం. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి. బంతి మొక్కలు ఏపుగా పెరిగితే, పూల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. సాగుకు విత్తనాల ద్వారా లేదా కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు.

కోతకు ముందు నీరుపడితే..

నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి. నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చేవరకు నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోయాలి. అదీ ఉదయం లేదా సాయంత్రం మాత్రమే కోయాలి. కోతకు ముందు నీటి తడి ఇచ్చినట్లయితే పూలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ చర్యలు

పేను.. పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వాటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రొటోఫాస్ 1.5 మిలీను కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తామర పురుగులు.. ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోదుమ రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రొటోఫాస్ 1.5 మిలీ.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొగ్గతొలిచే పురుగులు.. లార్వాలు పూల మొగ్గలను తొలిచేస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మిలీను.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు, నివారణ

నారుకుళ్లు తెగుళ్లు: నీటి తడి ఎక్కువగా ఉండి, వేడిగా ఉన్న చోట ఈ తెగులు వ్యాపిస్తుంది. లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రాముల కాప్టాన్ మందుతో తడపాలి. ఆకు మచ్చ తెగులు.. మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.

ఎరువుల వాడకం

మడులను తయారు చేసే సమయంలో బాగా చివికిన పశువుల ఎరువు ఎకరానికి 20 టన్నులు వేసి కలియ దున్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పట్టాలి. పాలిడాల్ పొడి చల్లడం వలన చీమలు, చెదను నివారించుకోవచ్చు. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి.

యూరియా వచ్చింది.. కలత తీరింది!



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

యాచారం: యూరియా కొరత కారణంగా నిన్నమొన్నటి వరకు కర్షకులు కలత చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. సాగు పనులు వదిలి.. శాంతడంత పాడవుగా పీఏసీఎస్, ఫర్టిలైజర్ దుకాణాల వద్ద గంటల కొద్దీ క్యూ కట్టారు. దీనికి స్పందించిన ప్రభుత్వం, అధికారులు.. 'యూరియా కోసం రైతులు ఇబ్బంది పడొద్దు. అవసరం మేరకు స్టాక్ వస్తోంది. అందరికీ అందజేస్తాం' అని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగతా ప్రాంతాల్లో ఎలా ఉన్నా.. తాజాగా సెలవు రోజైన ఆదివారం.. యాచారం మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా పంపిణీ చేశారు. 450 మందికి టోకెన్లు ఇచ్చి, పోలీసుల సమక్షంలో ఒకొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. సరఫరా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గత నాలుగైదు దఫాలుగా యూరియా కోసం వందలాది మంది రైతులు ఆందోళన చెసిన విషయం విధితమే.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

నందిగామ: పాత జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన నందిగామ శివారు నూజివీడు పరిశ్రమ సమీపంలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిశ్రమ సమీపంలోని రోడ్డు పక్కన చెట్ల పొదల్లో ఓ వ్యక్తి(65) మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులకు అందింది. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు.. శవాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

బాలికపై లైంగికదాడి

ఇద్దరిపై కేసు నమోదు

యాచారం: ఓ బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నందివనపర్తి గ్రామానికి చెందిన మైనర్(14)ను అదే గ్రామానికి చెందిన జి.క్రాంతి, బి.క్రాంతిలు రాత్రి వేళలో మాయమాటలు చెప్పి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. అక్కడ బాలికపై ఇద్దరు లైంగికదాడికి పాల్పడ్డారు. సమాచారం మేరకు అదే రాత్రి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఇద్దరిపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ, పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు ఆపరేటర్ మృతి



మహేశ్ (ఫైల్)

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు ఆపరేటర్ మత్తి చెందిన సంఘటన తలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి గ్రామానికి చెందిన బాషామోని మహేశ్(25).. నాలుగేళ్లుగా శ్రీ వేంకటేశ్వర మినరల్స్ కంపెనీలో ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం విధి నిర్వహణలో భాగంగా ఒక లారీలో పౌడర్‌ను లోడ్ చేశారు. తిరిగి వచ్చే క్రమంలో డ్రైవర్ వెంకటేశ్వర్లు లారీని నిర్లక్ష్యంగా ముందుకు తీయగా.. మహేశ్ ఫోర్క్ లిఫ్ట్ కింద పడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

దోమ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రే కీలకమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. దిర్సంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రూప్‌సింగ్‌కు ఇటీవలే జీహెచ్‌ఎంగా పదోన్నతి లభించడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం మత్తులో పోలీసు వాహనాన్ని ఢీకొన్న కారు

యువతి మృతి

- డీఐ, కానిస్టేబుల్‌కు గాయాలు



మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

లంగర్‌హౌస్: మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడుపుతూ కొందరు విద్యార్థులు పోలీసు వాహనాన్ని ఢీకొట్టగా.. ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్‌కు చెందిన హరీష్ రెండు రోజుల క్రితం తాము ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు. వేడుకలు ఘనంగా జరగడంతో మిత్రులకు పార్టీ ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇక్‌ఫాయ్ యూనివర్సిటీలో బీబీఏ చదువుతున్న తన స్నేహితులను పార్టీకి ఆహ్వానించాడు. పంజాబ్‌కు చెందిన కాశ్వి విజయ్ వర్గి(20), ఆమె సోదరుడు ఇంటర్ విద్యార్థి తనిష్క్ విజయ్ వర్గి, రియా విజయ్‌వర్గిలు పార్టీకి హాజరయ్యారు. ఆదివారం తెల్లవారుజామున కోఠిలో ఉంటున్న అక్షిత్ సింగ్ కారులో వారు నలుగురితో పాటు కూకట్‌పల్లికి చెందిన లిఖిత షిండేతో కలిసి బయల్దేరారు. మొఘల్‌నగర్ రింగ్ రోడ్డు వైపు వినాయక నిమజ్జనం నేపథ్యంలో ట్రాఫిక్‌జామ్ కావడంతో పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 112 నుంచి మూసీ పక్క రోడ్డులో వెళ్లి లంగర్‌హౌస్ మీదుగా పీ ఇంద్రారెడ్డి ఫ్లైఓవర్ ఎక్కారు. బ్రిడ్జి దిగే క్రమంలో అతివేగం కారణంగా కారు ముందు వెళుతున్న పోలీసు వాహనాన్ని వెనక నుంచి బలంగా ఢీకొంది. దీంతో కారు వెనక సీట్‌లో కూర్చున్న కాశ్వి సింగ్ ఛాతి, తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

తప్పిన పెను ప్రమాదం

ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ముందు కూర్చున్న వారు గాయాలతో బయటపడ్డారు. వెనక కూర్చున్న కాశి మృతిచెందగా ఆమె సోదరుడు తనిష్క్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే పోలీసు వాహనాన్ని ఢీకొట్టగా పోలీసు వాహనం ముందు వెళుతున్న డీసీఎంను ఢీ కొట్టింది. అయితే పోలీసు వాహన డ్రైవర్‌తో పాటు, డీసీఎం డ్రైవర్ అప్రమత్తమై హాండ్ బ్రేక్ వేయడంతో వాహనాలు కొద్దిగా ముందుకు వెళ్లి ఆగిపోయాయి. లేని పక్షంలో ముందు ఉన్న ఊరేగింపులపైకి దూసుకెళ్లి పెను ప్రమాదం జరిగేది. ఈ ఘటనలో డీఐ సత్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా కానిస్టేబుల్ వాజీద్, హోంగార్డు అలీముద్దీన్‌ను స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాశ్వి మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

23.98 గ్రాముల కొకైన్ పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు



స్వాధీనం చేసుకున్న కొకైన్

కుత్బుల్లాపూర్: గోవా నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 23.98 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య నేతృత్వంలో సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం బాలానగర్ వై జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న గోవా మపూసాకు చెందిన సంతోష్ జాదవ్‌ను అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతడి వద్ద చిన్న చిన్న ప్యాకెట్లలో 23.98 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేశ్వరరావు, సత్తార్, సంజయ్, మునాఫ్, తేజ పాల్గొన్నారు. కాగా నిందితుడు సంతోష్‌జాదవ్ గతంలో బేగంపేట్‌లో సీజ్ చేసిన 19 గ్రాముల కొకైన్ కేసులో రెండో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే లంబాడీలపై కుట్ర

సంతోష్‌నగర్: ఎన్నికల సమయంలో రాజకీయ నిరుద్యోగులు పదవుల కోసం హడావిడి చేస్తూ లంబాడీలపై విషం కుక్కే ప్రయత్నం చేస్తున్నారని.. ఆర్టికల్ 342ను సరిగా అర్థం చేసుకోకుండా కోర్టులను సైతం తప్పుదోవ పట్టించే దళారులు తమ అవసరాల కోసం గిరిజన తెగలను వాడుకుంటున్నారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మనాయక్, జిల్లా అధ్యక్షులు వి.రామ్‌కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలు నాయక్ అన్నారు. సంతోష్‌నగర్‌లోని సీఐటీయు కార్యాలయంలో ఆదివారం గిరిజన సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లంబాడీలు ఎస్టీ జాబితాలో నాలుగవ సీరియల్‌లో ఉన్నారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వందల మంది లంబాడీలు పాల్గొన్నారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారన్నారు. రాష్ట్రంలో లంబాడి రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోయ, గొండు, లంబాడీ తెగల మధ్య ఘర్షణ వాతావరణానికి రాజకీయ పార్టీల వైఖరే ప్రధాన కారణమన్నారు. పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం తెగల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని గిరిజన తెగలు అన్ని ఆలోచించి సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. పాలకవర్గాల కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పంతు నాయక్, భీమా నాయక్, శంకర్ నాయక్, మోతీలాల్, రాజేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వైద్యం కోసం నగరానికి వచ్చిన మహిళ పర్సు చోరీ

బంజారాహిల్స్: భర్త వైద్యం కోసం నగరానికి వచ్చిన ఓ మహిళ పర్సును చోరీకి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతి చిల్కాపూర్ కోకోలుతోటకు చెందిన కోలె శ్రీలక్ష్మీ తన భర్తకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఈ నెల 4న హైదరాబాద్‌కు వచ్చింది. ఈ క్రమంలో 5న ఉదయం కూకట్‌పల్లి నుంచి తన భర్తతో కలిసి జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ ఆలయానికి వెళ్లింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని ఆలయ కమాన్ వద్ద పూజా సామగ్రిని కొనుగోలు చేసిన కవర్‌లోనే తన పర్సును ఉంచింది. కొద్దిసేపటి తర్వాత వాటర్ బాటిల్ కొనేందుకు పర్సు కోసం చూడగా కనిపించలేదు. కవర్ కత్తిరించి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు తన పర్సును చోరీ చేశారని, అందులో రూ.30 వేలు ఉన్నాయని బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి

మల్కాజిగిరి: స్నేహితులతో కలిసి నిమజ్జనానికి వెళ్లిన ట్రాఫిక్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మల్కాజిగిరి విష్ణుపురికాలనీకి చెందిన కె.డేవిడ్(31) ఘట్‌కేసర్ ట్రాఫిక్ పీఎస్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న స్నేహితులు ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనంలో పాల్గొన్నాడు. నిమజ్జనం ర్యాలీలో నృత్యం చేస్తుండగా గుండెపోటు రావడంతో కింద పడ్డాడు. స్నేహితులు అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన విష్ణుపురి కాలనీలో విషాదాన్ని నింపింది. ఆదివారం డేవిడ్ అంత్యక్రియలు నిర్వహించారు.